సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా

మొగుడంపల్లిలో మహిళలకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్, జూన్ 18 : అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్సలు పొందిన నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో భరోసానిస్తుందని జహీరాబాద్ పట్టణ ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బండి మోహన్, బీఆర్ఎస్ ఝరాసంగం మండలాధ్యక్షుడు వెంకటేశం అన్నారు. బుధవారం స్థానిక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆయా మండలాలకు చెందిన 9 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 2.79 లక్షల చెక్కులను అందజేశారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలి

ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

నారాయణఖేడ్, జూన్ 18 : జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని కోరుతూ బుధవారం నారాయణఖేడ్‌లో స్థానిక ఎంఈవో విశ్వనాథ్‌కు జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్యను అందించాలని ఈనెల 11న జిల్లా విద్యాధికారి జారీ చేసిన ఆదేశాలను సక్రమంగా అమలయ్యే విధంగా చూడాలని ఎంఈవోను కోరారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు జిల్లా విద్యాధికారి ఆదేశాలను ఖాతరు చేయడం లేదని ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎంఈవో సానుకూలంగా స్పందిస్తూ నారాయణఖేడ్‌లోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ఉచితంగా విద్యనందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు ఎం.ఏ.ఖైసర్, మధుసూదన్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రవూఫ్, డానియల్, వెంకట్‌రాములు, పుండరీకం, కాశీనాథ్, రాములు, బాలు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో ముగిసిన వేలం పాట

గుమ్మడిదల, జూన్ 18 : జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామిదేవాలయంలో వేలంపాటలను నిర్వహించారు. బుధవారం వీరభద్రస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ మద్దిప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలకు దేవాదాయ ధర్మాదాయ కమిటీ ఇన్ రంగారావు సమక్షంలో వేలం పాటను నిర్వహించారు. ఏడాది పాటు నిర్వహించుకునే అమ్మవారి చీరలకు ఆర్. పోచయ్య రూ.2.65 లక్షలు, హెచ్.సంజయ్ వాహనాల పార్కింగ్ కోసం రూ.3.80 లక్ష లు, అమ్మవారి ఒడిబియ్యాని కి వెంకటేశ్ రూ. 28 వేలకు పాటపాడి దక్కించుకున్నట్లు, దేవాలయ ప్రాంగణంలో దుకాణ సముదాయాలకు ఏడు దుకాణాలకు ఒక్కొక్కదానికి నెలకు రూ. 2 వేలు ఇవ్వాలని తీర్మానించారు. ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య తెలిపారు. మాజీ చైర్మన్లు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

మసీద్‌ను సందర్శించిన అధికారులు

సుల్తాన్‌పూర్ జాతీయ రహదారి విస్తరణ పనులపై సమీక్ష



సుల్తాన్‌పూర్ మసీదు వద్ద సమీక్షిస్తున్న అధికారులు

చౌటకూర్, జూన్ 18 : మండలంలోని సుల్తాన్‌పూర్ వద్ద గల మసీద్‌ను రెవెన్యూ, పోలీసు, వక్ఫ్‌బోర్డు అధికారులు బుధవారం పరిశీలించారు. అందోలు-ఆర్డీవో పాండు, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య, వక్ఫ్‌బోర్డు ఈవో ఇబ్రహీంలతో కూడిన అధికారుల బృందం స్థానిక ముస్లిం మత పెద్దలు, స్థానికులతో కలిసి సమావేశమయ్యారు. సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయి దాదాపు మూడేండ్లు గడిచాయి. సుల్తాన్‌పూర్ గ్రామం వద్ద ముస్లింలకు చెందిన మసీద్ ఉంది. ఈ మసీద్ జాతీయ రహదారి విస్తరణలో పూర్తిగా కోల్పోతున్నది. మసీద్‌కు ఇరువైపులా సంబంధిత కాంట్రాక్టర్ సర్వీసు రోడ్డు పనులు పూర్తి చేశారు. మసీద్‌ను తొలిగించకుండా సదరు వర్గం అడ్డుకోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా తరచుగా సుల్తాన్‌పూర్ బస్టాండ్ వద్ద జాతీయ రహదారి ఇరుకుగా మారి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటుగా తాడ్దాన పల్లి చౌరస్తా, శివంపేట గ్రామాల వద్ద కూడా ఫ్లైఓవర్ వంతెనలను నిర్మించాలంటూ మంత్రి దామోదర రాజనరసింహ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రెవెన్యూ, పోలీసు, వక్ఫ్ బోర్డు అధికారులు సమావేశమై మసీద్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలంటూ ఆదేశించారు. దీంతో ఆయా శాఖల అధికారులు సుల్తాన్‌పూర్‌కు చేరుకున్నారు. మసీద్‌ను తొలిగించకుండా ఫ్లైఓవర్ వంతెనను నిర్మించాలంటూ అందుకు అవసరమైన సాధ్యసాధ్యాలను పరిశీలించాలంటూ అధికారులు సమాలోచనలు జరిపారు. ఆయా ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ వంతెనలు నిర్మిస్తే సర్వీసు రోడ్ల ఏర్పాటుకు మిగిలే స్థలం ఎంత అంటూ ఆరా తీశారు. మరో రెండు, మూడు దఫాలు సమావేశమై చర్చించనున్నట్లు అధికారులు తెలిపారు. ఏ వర్గానికి అన్యాయం జరుగకుండా, మత ఘర్షణలకు తావులేకుండా సున్నితమైన అంశాన్ని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో పాండు తెలిపారు. త్వరలో ఈ అంశాన్ని శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. శివంపేట గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ వంతెన నిర్మించకుండా జాతీయ రహదారుల ప్రాదికార సంస్థ అధికారులు ఇష్టానుసారంగా గ్రామానికి కిలోమీటర్ దూరంలో నిర్మించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎంపీపీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అలీం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామం వద్ద ఫ్లైఓవర్ వంతెన నిర్మిస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మేలు చేసినట్లవుతుందన్నారు. తహసీల్దార్ సంధ్యారాణి, నయాబ్ తహసీల్దార్లు అనుదీప్, శ్రీనివాస్ గౌడ్, సర్వేయర్ ప్రభాకర్, ఈవో మీర్ మున్వర్ అలీ, జోగిపేట సీఐ అనిల్ కుమార్, పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్, వక్ఫ్ బోర్డు ఏరియా ఇన్‌స్పెక్టర్ సాబేర్ హుస్సేన్, వక్ఫ్‌బోర్డు నయాబ్ తహసీల్దార్ అసీఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

షీటీమ్‌పై బాలికలకు అవగాహన

వాసర్‌లో బాలికలకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

సిర్గాపూర్ జూన్ 18 : బాలికలు స్మార్ట్ ఫోన్ వాడకం తగ్గించాలని ఏఎస్ఐ తులసిరాం, షీ టీం బృందం అధికారి చాంగూబాయి తెలిపారు. బుధవారం మండలంలోని వాసర్ హైస్కూల్‌లో బాలికలకు ప్రత్యేక అవగాహన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రాం, వాట్సాప్ చాటింగ్ వం టివి మానుకోవాలన్నారు. బాలికలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెచ్ఎం రమేశ్, టీచర్లు రహీం, తుకారం, గణపతి, నాగయ్య, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

మా దగ్గరే కొనాలి..!

- పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరిట దోపిడీ షురూ..
- తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలు
- స్కూల్ ఫీజు కన్నా పుస్తకాల ఫీజులే ఎక్కువ
- ప్రభుత్వ ఆదేశాలు పట్టించుకోని యాజమాన్యాలు
- చర్యలు తీసుకోవాలంటున్న విద్యార్థి సంఘాలు

సదాశివపేట, జూన్ 18 : పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కలలు కనే తల్లిదండ్రులకు ఫీజులు పెనుభారంగా మారుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలో ఫీజులు నానాటికీ పెరుగుతున్నాయి. దీనికి తోడు యూనిఫామ్, షూస్, బెల్టులు, పుస్తకాల ఫీజుల పేరిట ప్రైవేటు స్కూళ్లు తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నాయి. ఇవి కాకుండా మధ్యమధ్యలో ఈవెంట్లు, వేడుకల కోసం చిన్నారులకు ప్రత్యేక దుస్తులకు, క్యాస్ట్యూమ్స్‌కు మరికొంత మొత్తం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదాశివపేట పట్టణంలో ప్రైవే టు పాఠశాలల నిలువుదోపిడీ మొదలైంది. విద్యా సంస్థల యాజమాన్యాల వ్యాపార ధోరణి మితిమీరిపోతున్నది. అడ్మిషన్ల పేరిట ముందే ఫీజులు వసూలు చేస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి నోట్ బుక్కులు, పుస్తకాలను యథేచ్ఛగా అంటగడుతున్నారు. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే తల్లిదండ్రులకు ఫోన్ చేసి పాఠ్యపుస్తకాలు, బెల్టులు, యూనిఫామ్‌లు తమ వద్దే తీసుకోవాలని బయటి పుస్తకాలు అనుమతించమని తెలియజేశారు. విద్యార్థుల ఫీజులతో పాటు రూ. 5వేల నుంచి 15 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. పిల్లల భవిష్యత్ బాగుండాలని తల్లిదండ్రులు ఎంతైనా ఖర్చు చేస్తారనే ఉద్దేశంతో ఇష్టారీతిన వసూలు చేస్తున్నారు.

తల్లిదండ్రుల జేబులకు చిల్లు..

సదాశివపేట పట్టణంలో దాదాపు 20 వరకు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభం కావడంతో అంతకుముందు నుంచే పాఠశాలల యాజమాన్యాలు అత్యుత్సాహం ప్రదర్శించాయి. పరిమిత సీట్లు ఉన్నాయని కార్పొరేట్ సంస్థల పేరిట అడ్మిషన్లు చేసుకున్నారు. అడ్మిషన్ ఫీజు, టెస్టు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలలో ఒక్కో రేట్ ఫిక్స్ చేస్తున్నారు. నర్సరీకి రూ. 10వేల నుంచి రూ. 50 వేల వరకు తీసుకుంటున్నారంటే నమ్మశక్యం కాదు. ఇంటర్నేషనల్ పేరిట లక్షల్లో వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు అదనంగా ట్యూషన్ ఫీజు, పుస్తకాలు, యూనిఫామ్, టై, బెల్టు తదితర వాటి పేరిట తల్లిదండ్రుల జేబులకు చిల్లుపెడుతున్నారు.

తోకపేర్లతో మాయాజాలం

ఐఐటీ, టెక్నో, ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ పాఠశాలల పేరిట మెరుగైన వసతులు ఉన్నాయని కరపత్రాలు తయారు చేసి తల్లిదండ్రులను మాయచేస్తున్నారు. ఎలాంటి అనుమతులు పొందకుండా పాఠశాలలు నిర్వహిస్తూ మౌలిక వసతులు లేకున్నా రూ. వేలల్లో డొనేషన్లు, ఫీజులు వసూలు చేస్తున్నారు. సేవారంగమైన విద్యారంగాన్ని తమ అవసరాలకు వాడుకుంటున్నారు. క్రీడా మైదానాలు, ఫైర్ సేఫ్టీ, బస్సులకు ఫిట్‌నెస్ వంటివి లేకుండానే విద్యా వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

ఫీజులను నియంత్రించాలి..

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు యూనిఫామ్స్, బుక్స్, ఐడీకార్డుల పేరుతో విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నాయి. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై నిఘా పెంచాలి. అధికారులు స్పందించి అధిక ఫీజులను నియంత్రించాలి.

- పెద్దగొల్ల శ్రీహరి,
బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి

మొక్కలు నాటాలి

బిలాల్‌పూర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంఈవో

కోహీర్, జూన్ 18 : స్వచ్ఛమైన ఆక్సిజన్ కావాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంఈవో జాకీర్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండలంలోని బిలాల్‌పూర్, పర్సపల్లి, గొటిగార్‌పల్లి, బడంపేట గ్రామ పాఠశాల ఆవరణలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలను నాటారు. మొక్కల సంరక్షణకు వాటిని విద్యార్థులకు దత్తత ఇవ్వాలని హెచ్ఎంలకు సూచించారు. హెచ్ఎంలు సురేశ్, శ్రీనివాస్, పాండురంగారెడ్డి, ఉమారాణి, తదితరులు ఉన్నారు.

కేజీబీవీ గుమ్మడిదలలో నాన్‌టీచింగ్ స్టాఫ్ కావాలి

గుమ్మడిదల, జూన్ 18 : కేజీబీవీ గుమ్మడిదలకు నాన్ టీచింగ్ స్టాఫ్ కావాలని ఎంఈవో రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్‌కుక్-1, అసిస్టెంట్ కుక్-2, డే వాచ్‌మెన్-1, నైట్‌వాచ్‌మెన్-1, అటెండర్-1, స్వీపర్/ స్కావెంజర్-1కు పదోతరగతి చదివి ఉండాలి, అసిస్టెంట్ కుక్, స్వీపర్ పోస్టులకు 7వ తరగతి చదివి ఉండాలి, దరఖాస్తు చేసుకునే వారు 18-45 ఏండ్ల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు ఈ నెల 25 తేదీ వరకు కేజీబీవీ జిన్నారంలో ప్రత్యేక అధికారి ఉమామహేశ్వరికి దరఖాస్తు సమర్పించాలని గుమ్మడిదల మండల విద్యాధికారి, కేజీబీవీ ప్రత్యేక అధికారి రాంబాబు పేర్కొన్నారు.

అనంతారం పాఠశాల అభివృద్ధికి కృషి

గుమ్మడిదల, జూన్ 18 : మండలంలోని అనంతారం ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు తనవంతు సాయం అందిస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం అనంతారం పాఠశాలలో జరిగిన ఎస్ఎంఎస్ సమావేశాన్ని హెచ్ఎం. గోపాల్ కుమార్, విద్యా కమిటీ చైర్‌పర్సన్ స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణప్రాంతాల విద్యార్థులు ఆధునిక విద్యలో నైపుణ్యం సాధించాలన్నదే లక్ష్యంగా చేయూతను అందిస్తానని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్లు, షూస్, టైలు, బెల్టులు, ఐడీ కార్డులు సమకూర్చేందుకు సహాయపడుతానని తెలిపారు. ఆయనవెంట యాదిరెడ్డి, దయాకర్‌రెడ్డి, లక్ష్మణ్, రమణ, వీరారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింహులు, సాయిగౌడ్, బాలిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలి

అందోల్, జూన్ 18 : గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. బుధవారం అందోల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేశ్వర్‌కు కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి వేతనాలు చెల్లించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

మహిళ అదృశ్యం

నాగరాణి (ఫైల్)

జహీరాబాద్, జూన్ 18 : జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హుగ్గేలి గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై కాశీనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక గ్రామానికి చెందిన నాగరాణి (24) మహిళ ఈ నెల 9న కుమారుడి కోసం పుస్తకాలు, యూనిఫామ్ కొనేందుకు జహీరాబాద్ పట్టణానికి వెళ్లింది. తిరిగి సాయంత్రం ఇంటికి రాలేకపోవడంతో ఆమె కోసం పరిసరా ప్రాంతాల్లో గాలించినా అచూకీ లభించలేదు. భర్త సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సదాశివపేట, జూన్ 18 : ఈ నెల 19న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మధుసూదన్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. గురునగర్ కాలనీ, దత్తాత్రేయనగర్, రాఘవేంద్రనగర్, ఎవరెస్ట్ ఎన్‌క్లేవ్, పాతకేరి ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలిగించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

వికసించకుండానే వాడిపోతున్న 'రాజీవ్ యువ వికాసం'

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్, జూన్ 18 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ మాదిరిగానే రాజీవ్ యువ వికాస్ పథకం కూడా చెత్త బుట్టలోకి చేరిందని జహీరాబాద్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. బుధవారం స్థానిక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. జూన్ 2న రెండు లక్షల మంది లబ్ధిదారులను ప్రకటించి, మంజూరు పత్రాలను అందిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటాలు వట్టి మాటాలయ్యాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన కల్లబొల్లి మాటాలను నమ్మి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 16 లక్షలకు పైగానే రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. ఒక్కో యువకుడు దరఖాస్తు చేసుకునేందుకు రూ. 200 నుంచి 300 వరకు ఖర్చు చేసుకున్నారని, వాటి ద్వారా ప్రభుత్వానికి రూ. 30 కోట్ల మేరకు లాభం చేకూరిందన్నారు. ఈ పథకం అమలు విధానం పట్ల పునరాలోచన చేస్తామని రాష్ట్ర క్యాబినెట్ ప్రభుత్వం చెప్పడంతో యువతపై పిడుగు పడేసిందన్నారు. యువతకు మోసం చేయడం కాంగ్రెస్‌కు ఇదేమీ కొత్తకాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, బండిమోహన్, దీపక్, రాకేశ్, ఓంకర్, ఫయాజ్, రోహీత్, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై వ్యాసరచన పోటీలు

జోగిపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ తిరుపతి

అందోల్, జూన్ 18 : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతకు కృషిచేయాలని అందోల్-జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. బుధవారం జోగిపేట డాన్ బాస్కో పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో పాటు ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వంద రోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా మున్సిపల్ ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించనున్నారు. ప్రజలు విధిగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా కాలనీలు శుభ్రంగా ఉంటాయని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభను చూసిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు.

భూ సమస్యల దరఖాస్తులు పరిష్కరించాలి

కంది : ఆరుట్లలో భూభారతి సదస్సును పరిశీలిస్తున్న ఆర్డీవో రవీందర్

కంది, జూన్ 18 : భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలకు పరిష్కారం చూపాలని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ మండల రెవెన్యూ అధికారులకు సూచించారు. బుధవారం కంది మండలం ఆరుట్లలో జరిగిన భూభారతి సదస్సును ఆర్డీవో పరిశీలించారు. భూ సమస్యలపై రైతులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించారు. ఎక్కువ మొత్తంలో ఎలాంటి సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండలంలో ఈ నెల 3న ప్రారంభమైన భూ భారతి అవగాహన సదస్సులు నేటితో ముగిశాయన్నారు. తహసీల్దార్ రవి కుమార్ మాట్లాడుతూ మండలంలో నిర్వహించిన భూభారతి సదస్సుల్లో మొత్తం 335 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

అందోల్‌లో..

అందోల్, జూన్ 18 : భూ భారతిలో రైతులకు ఎలాంటి సమస్యల లేకుండా వాటిని పరిష్కరించడం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ తేన్ మొలి అన్నారు. మండలంలోని సంగుపేట, మాసాన్‌పల్లి తదితర గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ సదస్సులు ఉపయోగించుకోవాలన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో రాంరెడ్డి

జహీరాబాద్, జూన్ 17 : భూసంబంధిత సమస్యలు శాశ్వత పరిష్కరానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి రాంరెడ్డి అన్నారు. బుధవారం న్యాల్‌కల్ మండలంలోని రాజోలా, గణేశ్‌పూర్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను సందర్శించి, దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు ప్రభులు, రాజిరెడ్డి, శ్యాంరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్, సామగ్రి పంపిణీ

యూనిఫాం,స్కూల్ బ్యాగ్స్ అందజేస్తున్న ఎంఈవో మాణెయ్య, దాతలు

రాయికోడ్, జూన్ 18 : మండల పరిధిలోని కర్చల్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 90 మంది విద్యార్థులకు దాతలు సామగ్రి, యూనిఫామ్ పంపిణీ చేశారు. హైదరాబాద్ యశోద దవాఖాన వైద్యుడు డాక్టర్ అభినందరెడ్డి రూ.50 వేలతో విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్‌లను, ప్రభాకర్ (కేరూర్), ప్రభాకర్ (మారవెల్లి),రాజు(మారవెల్లి),సందీప్(మొగుడంపల్లి),సూభాష్(మొగుడంపల్లి),హైమాద్(కర్చల్) కలిసి రూ.60 వేలతో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, ఐడీ కార్డ్స్ అందజేశారన్నారు. దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈవో మాణెయ్య తెలిపారు. హెచ్ఎం నర్సిములు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

134వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

నల్లవల్లిలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రైతు జేఏసీ నాయకులు, మహిళలు

గుమ్మడిదల, జూన్ 18 : ప్యారానగర్ డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)కు వ్యతిరేకంగా రైతులు, మహిళలు, యువకులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం అప్రజాస్వామికమని రైతు జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ గ్రామ శివారులో ఏర్పాటు చేయబోయే డంపింగ్‌యార్డు వద్దని చేస్తున్న రిలే నిరాహారదీక్షలు బుధవారానికి 134వ రోజుకు చేరుకుంది. డంపింగ్‌యార్డు రద్దు జరిగే వరకు దీక్షలు కొనసాగిస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు.

అరకొర వసతుల మధ్య అంగన్‌వాడీ కేంద్రాలు

అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన అంగన్‌వాడీ కేంద్రం

నిజాంపేట్, జూన్ 18 : మండల కేంద్రమైన నిజాంపేట్‌లో అరకొర వసతుల మధ్య భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రమైన నిజాంపేట్‌లో మొత్తం ఆరు అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇందులో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కలిగి ఉండగా మిగతా మూడు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. మొదటి అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది చువ్వలు తేలి ప్రమాదకరంగా మారింది. ఎలాంటి ప్రమాదం జరగక ముందే పూర్తిగా తొలిగించి నూతన భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్లాస్టిక్‌ను నియంత్రించాలి

అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్

జిన్నారం, జూన్ 18 : వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వెజిటేబుల్ మార్కెట్లో కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు వ్యాపారస్తులు కొనుగోలుదారులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. నిషేధిత ప్లాస్టిక్‌